



ధాన్యం కొనుగోళ్లకు సన్నాహాలు

- జిల్లాలో 237 కేంద్రాల ఏర్పాటు
- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. మహబూబాబాద్‌లోని కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ మాట్లాడుతూ.. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలు చేసేందుకు 237 కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ధాన్యం సేకరణ వివరాలను వ్యవసాయ శాఖ ద్వారా స్వీకరించి కేంద్రాలకు వచ్చే ధాన్యం పూర్తి వివరాలు, కొనుగోలు, రవాణా, తదితర అంశాలను పరిశీలించాలన్నారు. మాయిశ్చర్ మిషన్ తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో అధికారులందరికీ శిక్షణ తరగతులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో గన్నీ సంచులు అవసరానికి అనుగుణంగా ముందస్తుగా సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటవెంటనే రైస్ మిల్లులకు పంపే విధంగా ప్రణాళిక ప్రకారం.. లారీలు, హమాలీలను సిద్ధంగా ఉంచుకోవాలని చెప్పారు. కొనుగోలుకు సంబంధించిన ధాన్యం డబ్బులను రైతు ఖాతాల్లో వెంటనే జమ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్రాల్లో నిబంధనల ప్రకారం సౌకర్యాలు కల్పించడం కోసం అన్ని శాఖల సమన్వయంతో ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని ఆదేశించారు. జిల్లాలో ఐకేపీ, గిరిజన కార్పొరేషన్, ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీల ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు మధుసూదన్‌రాజు, వెంకటేశ్వర్లు, ప్రేమ్‌కుమార్, విజయనిర్మల, కృష్ణవేణి, సాయిచరణ్, రమేష్ పాల్గొన్నారు.

ముగ్గురు అంతర్‌రాష్ట్ర మహిళా దొంగల అరెస్టు

- వివరాలు వెల్లడించిన సీఐ మహేందర్‌రెడ్డి


6


టౌన్ పోలీస్‌స్టేషన్‌లో నిందితులను అరెస్టు చూపుతున్న దృశ్యం

లోకల్ పోరులో బీసీల జోరు



- 42 శాతం రిజర్వేషన్ జోష్
- జనరల్‌లోనూ.. పోటీకి సై
- జిల్లాలో బీసీలకు 102 జీపీలు రిజర్వు
- పెద్దల ఆశీస్సుల కోసం నేతల ప్రయత్నాలు

మహబూబాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల పోరులో బీసీల జోరు హోరెత్తుతోంది. రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం బీసీలకు రిజర్వేషన్ కల్పిస్తూ జారీ చేసిన జీవో బీసీల్లో జోష్ నింపింది. మహబూబాబాద్ జిల్లాలో మొత్తం 482 గ్రామ పంచాయతీలకు గాను తాజా రిజర్వేషన్ ప్రక్రియలో బీసీలకు 102 గ్రామ పంచాయతీలు రిజర్వు అయ్యాయి. మరోపక్క జిల్లాలో 193 ఎంపీటీసీ స్థానాలకు గాను 59 స్థానాలు వీరికే దక్కాయి. ఇక 18 జడ్పీటీసీల్లో బీసీలకు 07, 18 ఎంపీపీల్లో బీసీలకు 06 చొప్పున రిజర్వేషన్లు కావడంతో సర్వత్రా ఈ వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది. స్థానిక ఎన్నికలకు సంబంధించి మండల ప్రజా పరిషత్(ఎంపీపీ), జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గం(జడ్పీటీసీ)లతో పాటు మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గం(ఎంపీటీసీ)ల రిజర్వేషన్ల ఖరారుతో జిల్లాలోని పల్లెల్లో మళ్లీ ఎన్నికల సందడి తారాస్థాయికి చేరుకుంది. ఏడాదిన్నర కిందట జరిగిన అసెంబ్లీ ఎన్నికలతోనే దాదాపు దశాబ్ద కాలం అనంతరం హస్తం హవా వచ్చేసింది. ఆపై తాజాగా జరగనున్న పార్టీ రహిత పంచాయతీ ఎన్నికలు, సింబల్‌తో జరిగే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పల్లెల్లోని నాయకులంతా అధికార కాంగ్రెస్ నుంచి పోటీ చేసేందుకే ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. మరోపక్క పదేళ్లపాటు తెలంగాణ సెంటిమెంట్‌తో అధికారంలో ఉండి గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చవిచూసిన గులాబీ బీఆర్ఎస్ తామేం తక్కువ కాదంటూ అన్ని చోట్ల హోరాహోరీ తలపడడానికి ఆ పార్టీ స్థానిక నాయకులు ఉవ్విళ్లూరుతున్నారు. కేంద్రంలో వరుసగా మూడు దఫాలు అధికారంలో ఉన్న బీజేపీని సైతం కొన్ని గ్రామాల్లో ఆశామాషీగా చూసే పరిస్థితి కనబడడం లేదు. అవకాశం వస్తే పంచాయతీ నుంచి ఎంపీటీసీలు ఎలాగైనా గెలిపించుకోవాలని ఆ పార్టీ నాయకత్వం వ్యూహరచన చేస్తోంది.



అంతా ఎమ్మెల్యేలు.. మాజీ ఎమ్మెల్యేలపైనే..

స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికలు.. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు.. మాజీలైన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపైనే పార్టీ శ్రేణులు ఆధారపడుతున్నట్లు తెలుస్తోంది. జిల్లా లో మొత్తం 18 మండలాల్లో ఎస్టీలకు జడ్పీటీసీలు 7 దక్కగా, ఎస్సీలకు 02, బీసీలకు 07, ఓసీలకు 02 రిజర్వు అయ్యాయి. ఎంపీపీల్లోనూ ఎస్టీలకు 09, ఎస్సీలకు 02, బీసీలకు 06, ఓసీలకు 02 చొప్పున దక్కాయి. దీంతో ఆయా మండలాల్లో బీసీలకు దక్కిన రిజర్వేషన్లకు తోడు ఓసీలకు కేటాయించిన స్థానాల్లోనూ పోటీకి బీసీలు ఉత్సాహం కనబరుస్తున్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ పదవి ఓసీ కేటగిరిలో ఉండడంతో బీసీలు ఆ స్థానాన్ని ఎందుకు కైవసం చేసుకోకూడదన్న కోణంలో ప్రయత్నాలు చేద్దామని భావిస్తున్నట్లు సమాచారం. అయితే జడ్పీటీసీకి నేరుగా పోటీ ఉండగా ఎంపీపీ కావాలంటే మాత్రం ముందుగా ఎంపీటీసీ స్థానాన్ని గెలుచుకుని ఆపై మండలంలోని మెజారిటీ ఎంపీటీసీల బలాన్ని కూడదీసుకోవాల్సిన అవసరం ఉంటుం ది. నేరుగా పోటీ చేసే జడ్పీటీసీకి ఎంత ఖర్చు అవుతుందో.. ఎంపీపీ కావాలంటే మాత్రం అంతకు మూడింతలు ఖర్చు పెట్టాల్సి వస్తుందని అంచనా కడుతున్నారు.

కాంగ్రెస్‌లో ఇలా.. బీఆర్ఎస్‌లో అలా..

జిల్లాలో కాంగ్రెస్ జోష్ ఉన్న గ్రామాల్లో పార్టీ రహిత పంచాయతీ, పార్టీ సింబల్‌తో ఎంపీటీసీ, జడ్పీటీసీల పోటీకి ఆసక్తి కనబరుస్తున్న నాయకులు ఎమ్మెల్యేల ఆశీస్సులు పొందేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. బీఆర్ఎస్‌లోనూ మాజీలైన ఎమ్మెల్యేల ఆశీస్సులు పొంది బరిలో నిలిచేందుకు గులాబీ నాయకులు ఆసక్తి చూపుతున్నారు. ఆయా పార్టీల్లో స్థానికంగా ఒకే పార్టీలో పోటీ తీవ్రంగా ఉంటే సర్పంచ్, ఉపసర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పీటీసీ లాంటి పదవుల పంపకాలు ముందుగానే పెద్దల ముందు ఒప్పందాలతో పోటీ చేయించేందుకు స్థానిక నాయకత్వం ప్రయత్నాలు చేపడుతోంది. ఒకే పార్టీలో పోటీ అభ్యర్థులిద్దరుంటే ప్రత్యర్థి పార్టీ ఆ పదవిని ఎగిరేసుకుపోతుందని కాంప్రమైజ్ మంత్రాన్ని జపిస్తూ సర్దుబాటు చేసేందుకు స్థానిక నాయకత్వం చర్యలు కొనసాగిస్తోంది. మొత్తానికి పల్లెలన్నీ ఇప్పుడంతా ఎన్నికల సందడితో కోలాహలంగా ఉన్నాయి.

అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- ప్రభుత్వ విప్ జాటోత్ రాంచంద్రునాయక్
- మరిపెడలో డోర్నకల్ నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్

మరిపెడ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రతీ కార్యకర్త కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పని చేయాలని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచంద్రునాయక్ పిలుపునిచ్చారు. సోమవారం మరిపెడ బంగ్లాలోని భార్గవ్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన డోర్నకల్ నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే ప్రతీ మండలం, ఊరు నుంచి జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాల కోసం ముగ్గురేసి అభ్యర్థుల పేర్లను కాంగ్రెస్ హైకమాండ్‌కు పంపించామన్నారు. బీసీ రిజర్వేషన్ల అమలు కోసం పార్టీ ఎంతో కృషి చేస్తుందని గుర్తుచేశారు. అక్టోబరు 8 తర్వాత కోర్టు తీర్పు పరిణామాలతో ముందుకు పోదామన్నారు. స్థానిక ఎన్నికలంటేనే కార్యకర్తలు, నాయకులు ఎదగడమన్నారు. ఎంతో కొంత ఆర్థిక బలమున్నోళ్లు పోటీ చేసేలా మీ గ్రామాల్లో ముఖ్య కార్యకర్తలు కూర్చొని అభ్యర్థి ఎంపికకు మాట్లాడుకోవాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను గడపగడపకు తీసుకెళ్లి ఓట్లు అడగాలన్నారు. సమావేశంలో జిల్లా కాంగ్రెస్ నేత యుగేంధర్‌రెడ్డి, కేసముద్రం మార్కెట్ వైస్ చైర్మన్ ఐలిమల్లు, అన్ని మండలాల అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్, పట్టణ బాధ్యులు, గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

గిరిజన రైతు ఆత్మహత్య

- ఆర్థిక ఇబ్బందులతో ఉరి
- పీక్లాతండాలో ఘటన



భాస్కర్(ఫైల్)

కేసముద్రం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో గుగులోత్ భాస్కర్(40) అనే గిరిజన రైతు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన కేసముద్రం మండలం నారాయణపురం శివారు పీక్లాతండాలో సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఎస్ఐ కె.క్రాంతికిరణ్ తెలిపిన ప్రకారం... వ్యవసాయం చేసుకుని జీవించే భాస్కర్‌కు తండాలో మూడెకరాల భూమి ఉంది. ఆయన భార్య సరిత గృహిణి కాగా, పెద్దకుమారుడు అజయ్ నాగాలాండ్ ఎన్ఐటీలో బీటెక్, చిన్నకుమారుడు చరణ్ ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. పిల్లల చదువులకు, కుటుంబ అవసరాల కోసం కొద్దిరోజులుగా ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం రాత్రి భోజనం చేసి ఇంట్లో నిద్రించారు. అనంతరం తెల్లవారుజామున కొట్టంలో చీరతో ఉరివేసుకొని భాస్కర్ ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా, తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో తన భర్త ఆత్మహత్య చేసుకున్నట్లు భార్య సరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



కేసముద్రం మార్కెట్ యార్డులో మొక్కజొన్నలను ఆరబెట్టుకుంటున్న రైతులు

మొక్కజొన్నకు 'మద్దతు' కరువు

- వానలతో దెబ్బతింటున్న నాణ్యత
- క్వింటాకు రూ.1960 నుంచి రూ.2090 మధ్య ధరలు

6

రేషన్ 'డీల'ర్లు

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో రూ.12.5 కోట్లు పెండింగ్
- ఒక్కొక్కరికి రూ.50వేల నుంచి లక్షకు పైగా బకాయి
- రాష్ట్రం కరుణించినా.. కనికరించని కేంద్రం
- షాపుల బంద్‌కు సిద్ధమవుతున్న డీలర్లు

ఆరు నెలలుగా అందని కమీషన్



హనుమకొండ సిటీ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్లకు కమీషన్ చెల్లించడంలో కేంద్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చూపుతోంది. ఆరు నెలలుగా కేంద్ర ప్రభుత్వ కమీషన్ వాటా డీలర్లకు ఇంకా విడుదల కాలేదు. బకాయిలు ఎప్పుడెప్పుడు అందుతాయా.. అని డీలర్లు ఎదురు చూస్తున్నారు. దసరా పండుగ క్రమంలో కేంద్రం కరుణిస్తుందని ఆశించగా డీలర్లకు నిరాశే మిగిలింది. ఈ మాసం తొలి వారం ముగుస్తున్నా ఇంకా కమీషన్ విషయంలో కేంద్రం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ డీలర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తమ బాధలను కేంద్రం పట్టించుకోవడం లేదనే ఆగ్రహానికి డీలర్లు గురవుతున్నారు. ఇక ఉపేక్షించేది లేదని, త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా షాపుల నిరవధిక బంద్ పాటించాలనే నిర్ణయానికి వస్తున్నారు. రేషన్ డీలర్లకు కమీషన్ డబ్బులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేస్తాయి. రెండు ప్రభుత్వాల వాటా కమీషన్ రూపంలో డీలర్లకు చేరుతుంది. కిలో బియ్యం పంపిణీకి రూ.1.40 పైసల కమీషన్ చొప్పున డీలర్‌కు చెల్లింపు ఉంటుంది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా రూ.0.50 చెల్లిస్తుంది. కేంద్రం రూ.0.90 పైసలను భరిస్తూ ఈ మేరకు డీలర్ ఎన్ని కిలోలు పంపిణీ చేస్తే ఆ లెక్కన కమీషన్ డబ్బులు అందుకుంటాడు. ఈ లెక్కన ప్రతీ నెల డీలర్‌కు కమీషన్ డబ్బులు అందాల్సి ఉంటుంది. ఈ విషయంలో అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. డీలర్లు రోడ్డెక్కి నిరసనలు, ధర్నాలు చేయడంతో ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం తన వంతులోని ఐదు నెలల కమీషన్ బకాయిలను విడుదల చేసింది. కానీ, కేంద్రం మాత్రం ఇప్పటికీ స్పందించకపోవడమే డీలర్లకు ఆగ్రహాన్ని కలిగిస్తోంది.

రూ.12.5 కోట్లకు పైగా బకాయిలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 2,200 రేషన్ షాపులు ఉన్నాయి. షాపులకు సంబంధించిన డీలర్లకు కేంద్ర ప్రభుత్వ కమీషన్ వాటా డబ్బులు రూ.12.5 కోట్లకు పైగా విడుదల కావాల్సి ఉంది. ఒక్కో డీలర్‌కు రూ.50వేల నుంచి లక్షకు పైగా డబ్బులు

(మిగతా 6లో..)

నిరవధిక బంద్ దిశగా డీలర్లు

దసరా పండుగను దృష్టిలో పెట్టుకొని కేంద్రం కమీషన్ డబ్బులు విడుదల చేస్తుందని డీలర్లు ఆశించారు. అప్పటికే షాపుల నిరవధిక బంద్ పాటించాలనే నిర్ణయానికి వచ్చిన డీలర్లు పండుగ సమయంలో లబ్ధిదారులకు ఇబ్బందులు సృష్టించరాదనే భావంతో వేచి చూశారు. కానీ, అక్టోబరు కూడా రావడం ఆరు నెలలుగా బకాయిలు అందకపోవడంతో ఇక రేషన్ షాపుల నిరవధిక బంద్‌కు సిద్ధమవ్వడమే మార్గమనే నిర్ణయానికి డీలర్లు వస్తున్నారు.

బకాయిలను కేంద్రం తక్షణమే విడుదల చేయాలి

బత్తుల రమేశ్ బాబు, తెలంగాణ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు



కేంద్ర ప్రభుత్వం తక్షణమే రేషన్ డీలర్ల కమీషన్ బకాయిలను విడుదల చేయాలి. లేదంటే షాపులను నిరవధికంగా బంద్ చేస్తాం. సన్న బియ్యం సరఫరా కావడంతో ప్రజలకు ఇబ్బంది కలిగించరాదనే బంద్ విషయంలో ప్రస్తుతానికి వెనక్కు తగ్గాం. ఇదే పరిస్థితి కొనసాగితే తప్పక బంద్ పాటిస్తాం. ఇందుకు కేంద్ర ప్రభుత్వానిదే బాధ్యత. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్రంతో మాట్లాడి మా సమస్య పరిష్కారించాలని విజ్ఞప్తి. కమీషన్ డబ్బులు నెల నెలా క్రమంగా విడుదల చేయాలి. కమీషన్ డబ్బులను రూ.300కు పెంచడంతో పాటు తమ న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని విన్నవించుకుంటున్నాం.



స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలి

● మాజీ మంత్రి డీఎస్ రెడ్యానాయక్



కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న మాజీ మంత్రి రెడ్యానాయక్

నర్సింహులపేట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని మాజీ మంత్రి డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వెంకటేశ్వర ఫంక్షన్ హాల్లో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అనేక వాగ్దానాలను ఇచ్చి ప్రజలను నిండా ముంచిందన్నారు. డోర్నకల్ నియోజక వర్గంలో తాను చేసిన అభివృద్ధి పనులు నేడు స్థానిక ఎన్నికల్లో అభ్యర్థులను గెలుపిస్తాయని చెప్పారు. డోర్నకల్ ప్రజలు హంసలాంటి వారని అందుబాటులో ఉండే నాయకుడిని ఎన్నుకుంటారని, రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటర్లు బుద్ధి చెబుతారని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు షైదం దేవేందర్, మిరియాల వెంకన్న, కొండబత్తిని జగదీశ్వర్, కొత్త రవీందర్‌రెడ్డి, నెలకుర్తి నర్సింహారెడ్డి, కుంభం సుధీర్‌రెడ్డి, ఎల్లు మధుసూదన్‌రెడ్డి, ఖాజామీయా, రవి, సురేష్, వీరన్న పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

● డీఎంహెచ్‌వో రవిరాథోడ్



అన్నప్రసాద వితరణ చేస్తున్న డీఎంహెచ్‌వో రవి రాథోడ్

తొర్రూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : తొర్రూరు లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని జిల్లా వైద్యాధికారి రవి రాథోడ్ అన్నారు. సోమవారం లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు ఆధ్వర్యంలో క్లబ్ సభ్యుడు దారం కుమారస్వామి పుట్టినరోజు సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు, గర్భిణులకు, బాలింతలకు అన్నప్రసాద వితరణ చేశారు. అనంతరం పర్యావరణంపై అవగాహన కల్పిస్తూ జూట్ బ్యాగుల పంపిణీ, మొక్కలు నాటడం, వ్యాధులపై అవగాహన కల్పించి కరపత్రాలు అందించారు. ఈ సందర్భంగా రవి రాథోడ్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పేద ప్రజలను ఆదుకోవడం అభినందనీయమని అన్నారు. సేవా కార్యక్రమాలు మరిన్ని చేపట్టి ప్రజలకు అండగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ రాంనర్సయ్య, క్లబ్ సభ్యులు తమ్మెర విశ్వేశ్వర రావు, రవీందర్ రెడ్డి, కిరణ్ కుమార్, నందనాదేవి, మీరజ్, ప్రియాంక తదితరులు ఉన్నారు.

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరేద్దాం

● పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి

పెద్దవంగర, అక్టోబర్ 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నిక ల్లో నాయకులు, కార్యకర్తలు కష్టపడి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. సోమవారం పాలకుర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాల యంలో మండలంలోని కాన్వాయిగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు బొమ్మరబోయిన ప్రదీప్, భూక్య కృష్ణ, రాగుర్, రవితో పాటు పలువురు నాయకులు కాంగ్రెస్ చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి ఒక్కరి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో పాలకుర్తి నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దు కుందామని ఎమ్మెల్యే తెలిపారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రజలకు అభివృద్ధి, అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టామని తెలిపారు. ప్రతీ పేదవాడికి సొంత ఇంటి కల నెరవేర్చిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందిస్తామని తెలిపారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న సర్కారుపై ప్రతిపక్షాలు కుట్రలు పన్నుతున్నాయని వాటిని తిప్పికొట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. మండల స్థాయి, గ్రామస్థాయి నాయకులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలకు రిజర్వేషన్ అమలు చేయాలి

● ఆదివాసీ ప్రజా సంఘాల డిమాండ్



కొత్తగూడలో మాట్లాడుతున్న నాయకులు

కొత్తగూడ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం గుర్తించిన 5వ షెడ్యూల్‌లోని హక్కులు, చట్టాలను పరిగణలోకి తీసుకుని ఏజెన్సీ ప్రాంతంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలను ఆదివాసీలకే కేటాయించాలని ఆదివాసీ ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కొత్తగూడలో సోమవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఆదివాసీలు రాజకీయాల్లో ఎదగకుండా చేసే కుట్రలో భాగంగానే ఏజెన్సీ ప్రాంతంలో జనరల్ రిజర్వేషన్లు కేటాయించారని ఆరోపించారు. దీని వలన షెడ్యూల్డ్ ప్రాంతంలోని చట్టాల ఉల్లంఘన జరుగుతుందని, గిరిజనులు తీవ్రంగా నష్టపోతారని పేర్కొన్నారు. సమావేశంలో ధనసరి రాజేష్, మోకాళ్ల సుధీర్, పూనెం సందీప్ దొర, ఆగబోయిన ప్రశాంత్, ఈసం కాంతారావు పాల్గొన్నారు.

జింక మాంసం స్వాధీనం



పట్టుబడిన భద్రయ్య



వండిన జింక మాంసం

మహాముత్తారం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : వండిన జింక మాంసాన్ని అటవీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పెదపల్లి రేంజర్ వెంకటేశ్వరరావు సోమవారం వెల్లడించారు. మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన అంగోత్ భద్రయ్య ప్రతి రోజూ తన మేకల మందతో అడవిలోకి వెళ్తుంటాడు. ఈ క్రమంలో అతడు తన ఇంటి వద్ద జింక మాంసం వండుకుంటున్నాడనే సమాచారం రావడంతో ఫారెస్టు అధికారులు దాడులు నిర్వహించారు. అతడి ఇంటి నుంచి కేజీ మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మాంసం ఎక్కడిదని అడగ్గా మేకలు మేపడానికి తాను వెళ్లగా అడవిలో చనిపోయి ఉన్న జింక కనిపించిందని, ఆ కళేబరం నుంచి కొంత మాంసాన్ని తెచ్చుకొని వండుకుంటున్నానని చెప్పాడు. దీంతో భద్రయ్యను అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చినట్టు రేంజర్ తెలిపారు. ఈ దాడుల్లో ఎఫ్ఎస్‌వో అస్లం ఖాన్, ఎఫ్‌బీవో అఖిల్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంటింజెన్సీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



కొత్తగూడలో వర్కర్లకు సంఘీభావం తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

కొత్తగూడ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న కాంటింజెన్సీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొమ్మనబోయిన వేణు, కొత్తగూడ గ్రామ మాజీ సర్పంచ్ భూపతి తిరుపతి డిమాండ్ చేశారు. కాంటింజెన్సీ వర్కర్లు కొత్తగూడలో చేపట్టిన సమ్మెకు బీఆర్ఎస్ నాయకులు సోమవారం సంఘీభావం పలికారు. వర్కర్లకు మద్దతుగా సమ్మెలో భైఠాయించారు. కార్యక్రమంలో నాయకులు భూక్య మల్లయ్య, సోలం శ్రావణ్, జిమ్మిడి శ్రీనివాస్, బంగారి నరేష్, నాయకులు పాల్గొన్నారు.

గుండెపోటుతో గ్రేహౌండ్స్ ఆర్ఎస్ఐ మృతి

● నివాళులర్పించిన గ్రేహౌండ్స్ డీఐజీ కల్మాల్, ఎమ్మెల్యే కడియం

● పోలీస్ లాంఛనాలతో అంత్యక్రియలు



అచ్యుత రెడ్డి (ఫైల్)



అచ్యుత రెడ్డి అంతిమయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ మండలంలోని రాఘవపూర్‌కు చెందిన గ్రేహౌండ్స్‌లో ఆర్ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న గంగుల అచ్యుతరెడ్డి (54) శనివారం హైదరాబాద్‌లో గుండెపోటుతో మృతి చెందాడు. సోమవారం ఆయన స్వగ్రామం రాఘవాపూర్‌లో పోలీస్ లాంఛనాలతో అంత్యక్రియలను నిర్వహించారు. గ్రేహౌండ్స్ డీఐజీ కల్మాల్ మృతుడి ఇంటిని చేరుకుని నివాళులర్పించారు. గ్రేహౌండ్స్ ఎస్పీ సత్య శ్రీనివాస్, డీఎస్పీలు పేగ్, సాగర్, ఆర్ఐలు దాసు, శంకర్‌తోపాటు రిటైర్డ్ ఉద్యోగులు, ప్రస్తుతం గ్రేహౌండ్స్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది నివాళులర్పించారు. అంతిమయాత్రకు ముందు గాలిలోకి కాల్పులు జరిపి గౌరవ వందనం సమర్పించారు. 1990లో ఏపీఎస్పీ కానిస్టేబుల్‌గా విధుల్లో చేరిన అచ్యుత రెడ్డి 1994 వరకు నిజామాబాద్ డిచ్‌పల్లిలో విధులు నిర్వహించారు. 1994లో మామునూర్ బెటాలియన్‌కు చేరుకొని అక్కడ కొంతకాలం పనిచేసి గ్రేహౌండ్స్ విభాగంలో చేరి ప్రతిభ కనబరిచి అంచెలంచెలుగా ఆర్ఎస్‌గా ఎదిగారు. శనివారం గ్రేహౌండ్స్ ఆర్ఎస్ఐగా విధులు నిర్వహిస్తుండగా క్యాంపులోనే గుండెపోటుకు గురి కాగా అక్కడి సిబ్బంది ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న క్రమంలో పలుమార్లు గుండెపోటు రావడంతో మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య మంజుల, కుమారుడు, కూతురు ఉన్నారు.

అచ్యుత రెడ్డి అకాల మరణం తీరనిలోటని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. రాఘవాపూర్ మృతదేహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు జూలకుంట్ల శిరీష్ రెడ్డి, నాయకులు నాగరబోయిన యాదగిరి, బత్తిని దశరథంగౌడ్, కాసాని బొందయ్య, కందుల గట్టయ్య, మహేష్ రెడ్డి, పవన్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సుకు రాజ్‌కుమార్



హనుమకొండ కల్చరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల తెలుగు విభాగం అధ్యాపకులు ఆగపాటి రాజ్‌కుమార్ అంతర్జాతీయ సదస్సుకు ఎంపికయ్యారు. తమిళనాడులోని మధురై కామరాజ్ యూనివర్సిటీలో విశ్వర్షి వాసిలి వాఙ్మయం-దృక్పథాల ఆవిష్కరణ అనే అంశంపై ఈ నెల 9, 10, 11 తేదీలలో జరగనున్న అంతర్జాతీయ సదస్సులో 'వసంతగానం చేద్దామంటున్న వాసిలి కవిత్వం- ఒక పరిశీలన' అనే అంశంపై ఆగపాటి రాజ్‌కుమార్ పత్ర సమర్పణ చేయనున్నారు. ఈ సందర్భంగా ఆయనను ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

ఎస్సీ వర్గీకరణ ఫలాలు అందరికీ అందాలి

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ



మంద కృష్ణమాదిగను సన్మానిస్తున్న ప్రొఫెసర్లు, మాదిగ నేతలు

కేయూ క్యాంపస్ అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ ఫలాలు దళితుల్లోని అన్ని వర్గాలకు అందాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ సూచించారు. సోమవారం కేయూ గణితశాస్త్ర విభాగంలో ఉమ్మడి వరంగల్ జిల్లా , కేయూ మాదిగ ఉద్యోగుల సంఘం (ఎంఈఎఫ్) అధ్యక్షకార్యదర్శులు డాక్టర్ పోడేటి శ్రీనివాస్, డాక్టర్ ఎన్.సుజాతల నేతృత్వంలో పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్న సందర్భంగా ఘన సన్మానం చేశారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో కృష్ణమాదిగ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎస్సీ వర్గీకరణ విద్య, ఉద్యోగాలతో పాటు అన్ని విభాగాల్లో అమలు జరిగేలా చూడాలన్నారు. అణగారిన వర్గాలకు అండగా నిలుస్తామన్నారు. 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటంలో అనేక అవాంతరాలను ఎదుర్కొన్నామని చెప్పారు. ఉద్యోగాల్లో, ప్రమోషన్లలలో ఎస్సీ వర్గీరణ జరుపాలని డిమాండ్ చేశారు. మాదిగ ఉద్యోగులు జాతి అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. పీడిత వర్గాలవిముక్తికి పోరాటాలు చేస్తామన్నారు. భారీ గజమాలతో ఘన సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ తాళ్లపల్లి మనోహర్, హాస్టల్స్ డైరెక్టర్ఎల్‌పీ రాజ్‌కుమార్, బీసీ నేత డాక్టర్ తాడూరి శాస్త్రి, డాక్టర్ పుల్లా శ్రీనివాస్, డాక్టర్ కొట్టే భాస్కర్, డాక్టర్ సంగాల ఎఫ్రామ్‌రాజ్, డాక్టర్ సంకినేని వెంకన్న, డాక్టర్ మంద వీరాస్వామి, ఎంఈఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దనయ్య, దిలీప్, డాక్టర్ మామిడి లింగయ్య, డాక్టర్ సిలివేరు రాజ్‌కుమార్, కుమ్మరి రాజయ్య, మంద రాజు, మంద శ్యామ్, బొక్క మొగిలి, బొచ్చు తిరుపతి, కుమ్మరి శ్రీనాథ్, డాక్టర్ ఎడ్ల ప్రభాకర్, సూపరింటెండెంట్ బొల్నేపాక ప్రభాకర్, డాక్టర్ గజ్జెల మల్లేశ్, డాక్టర్ వంగాల సుధాకర్, వడ్డెపల్లి మోహన్,డాక్టర్ పుల్లా కుమార్, డాక్టర్ కుమారస్వామి, బొక్క దయాకర్, ప్రవీణ్ కుమార్ తోపాటు విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

గణేష్ ఎంబీబీఎస్ చదువు బాధ్యత కేటీఆర్‌దే

మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్



గణేష్‌కు ఆర్థిక సహాయం అందిస్తున్న దాస్యం వినయ్ భాస్కర్

హనుమకొండ టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి):హనుమకొండలోని పెద్దమ్మగడ్డకు చెందిన నిరుపేద విద్యార్థి తల్లిదండ్రులను కోల్పోయి ఆర్థిక స్థోమత లేక ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన ఆర్మళ్ల గణేష్ ఎంబీబీఎస్ చదువు బాధ్యత మాజీ మంత్రి , బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీసుకుంటారని మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో కేటీఆర్ విద్యార్థికి అండగా ఉంటామని ట్విట్టర్‌లో స్పందించడంతో దాస్యం వినయ్ భాస్కర్ ఆ విద్యార్థికి రూ. లక్షా 50వేలు నగదు విద్యార్థికి అందించారు. ఈ సందర్భంగా వినయ్ భాస్కర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో అన్ని వర్గాలను ఆదుకున్నారని పేర్కొన్నారు. వేలాది మంది పేద విద్యార్థులకు ఆర్థిక భరోసా అందించినట్లు తెలిపారు. ఆర్మళ్ల గణేష్ చదువు పూర్తి బాధ్యత కేటీఆర్ తీసుకుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో దేవదాసు , బోలెపాక రాజేష్, పాస్టర్ స్వామిదాసు గణేష్ ఆర్థిక పరిస్థితిపై కేటీఆర్‌కు ఆర్థిక సహాయం కోసం ట్విట్టర్‌లో పెట్టడంపై వినయ్ భాస్కర్ వారికి అభినందనలు తెలిపారు

ఉత్తమ పోలీస్‌స్టేషన్లలో ఐనవోలుకు రెండో స్థానం ?

● ఆలిండియాలో 70వ స్థానం



ఐనవోలు పోలీస్‌స్టేషన్ భవనం

ఐనవోలు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఐనవోలు మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఉత్తమ పోలీస్‌స్టేషన్‌గా ఎంపిక కావడానికి అడుగుదూరంలో నిలిచింది. ప్రతి సంవత్సరం దేశవ్యాప్తంగా ఉత్తమ పోలీస్‌స్టేషన్ల ఎంపిక చేయడం తెలిసిందే. దేశవ్యాప్తంగా 16,800 పోలీస్‌స్టేషన్లు ఉండగా అందులో ఈ యేడు (2025) ఐనవోలు పోలీస్‌స్టేషన్ ఆలిండియా వ్యాప్తంగా 70వ స్థానం, రాష్ట్రంలో 2 స్థానంలో ఆన్‌లైన్ పెర్ఫార్మెన్స్ కార్యక్రమంలో ఎంపికైంది. ఒక ఆన్‌లైన్ కార్యక్రమాలే కాకుండా వివిధ విభాగాల్లో సేవలు, విధులను హోమ్ మినిష్టరి విభాగ బృందం క్షేత్రస్థాయిలో పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించి ర్యాంకును నిర్ణయిస్తారు. ఐనవోలు పోలీస్‌స్టేషన్‌కు దేశంలోనే ఉత్తమ ర్యాంక్ సాధించేలా కృషి చేస్తున్నారు. ఐనవోలు పోలీస్‌స్టేషన్‌కు సొంత భవనం లేదు. దేవస్థానం సత్రాలలో కొనసాగుతుంది. హోమ్ మినిష్టరి బృందం పోలీస్‌స్టేషన్‌కు వచ్చినపుడు స్టేషన్ పరిసరాలు, పరిశుభ్రత, పచ్చదనం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదారుల దరఖాస్తులు సన్నిహిత కౌంటర్ ద్వారా స్వీకరణ, వాటి పరిశీలన బాధితులకు లభించిన న్యాయం, కేసుల నమోదు వివరాలు, శిక్షలు, పోలీసుల విధి నిర్వహణ, చెడు రుగ్మతలపై ప్రజలను చైతన్యపరిచిన కార్యక్రమాలు, ఫ్రెండ్లీ పోలీస్ విధానం తదితర విషయాలను పరిశీలించి అన్ని అంశాలలో పారదర్శకంగా ఉంటే రాష్ట్రంలో మొదటిది దేశంలో ఉత్తమ ర్యాంక్ పొందాలన్న లక్ష్యంగా ఎస్సై పస్తం శ్రీనివాస్ నేతృత్వంలో సిబ్బంది ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

రేపు జిల్లా స్థాయి బాక్సింగ్ ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) ఆధ్వర్యంలో (రేపు) బుధవారం హనుమకొండ అశోక జంక్షన్‌లోని డీఎస్ఏ బాక్సింగ్ హాల్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి బాక్సింగ్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ఐ అండర్ -17 క్రీడా పోటీల కార్యదర్శి ప్రశాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ - 17 బాలబాలికల విభాగంలో నిర్వహించనున్న ఉమ్మడి జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొనే బాలబాలికలు 1 జనవరి 2009 తర్వాత జన్మించిన వారు ఈ ఎంపిక పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. ఇక్కడ జిల్లా స్థాయిలో నిర్వహించే బాక్సింగ్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు ఈ నెల 10, 11, 12 తేదీల్లో హనుమకొండ అశోక జంక్షన్‌లోని డీఎస్ఏ బాక్సింగ్ హాల్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి అండర్ -17 బాల బాలికల చాంపియన్ షిప్ పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఆసక్తి , అర్హత కలిగిన క్రీడాకారులు తమ జనన ధ్రువీకరణ పత్రం , పాఠశాల నుంచి బోనఫైడ్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు వెంట తీసుకొని ఈ నెల 8న హనుమకొండ డీఎస్ఏ బాక్సింగ్ హాల్‌లో ఉదయం 9 గంటలకు రిపోర్టు చేయాలని ప్రశాంత్ ఆ ప్రకటన ద్వారా పేర్కొన్నారు. మరిన్ని వివరాలకై 9866450592లో సంప్రదించాలని ప్రశాంత్ సూచించారు.

సీపీఎం అభ్యర్థులను గెలిపించాలి

మండల కార్యదర్శి అలవాల సత్యవతి



సమావేశంలో మాట్లాడుతున్న మండల కార్యదర్శి అలవాల సత్యవతి

గార్ల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే సీపీఎం అభ్యర్థులను ప్రజలు గెలిపించాలని ఆ పార్టీ మండల కార్యదర్శి అలవాల సత్యవతి అన్నారు. సోమవారం గార్లలోని స్థానిక పార్టీ కార్యాలయంలో శాఖ కార్యదర్శుల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పేదల సమస్యలే ఎజెండాగా సమరశీల పోరాటాలు చేస్తున్న సీపీఎం పార్టీని ప్రజలు ఆదరించాలన్నారు. ఎన్నికల హామీలను గాలికి వదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మతాన్ని అడ్డం పెట్టుకొని ప్రజలను రెచ్చగొట్టే పార్టీని ఓటర్లు తిరస్కరించాలన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా నాయకుడు కందునూరి శ్రీనివాస్, గోవిందు, వెకటేశ్వర్లు, మౌనిక, వీరభద్రం, రామయ్య, లోకేశ్వరరావు, అంబటి వీరస్వామి పాల్గొన్నారు.

రామప్పలో రేపటి నుంచి హెరిటేజ్ క్యాంపు

వెంకటాపూర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయంలో ఈనెల 8 నుంచి వరల్డ్ హెరిటేజ్ క్యాంపును నిర్వహించనున్నారు. ఈనెల 8 నుంచి 17 వరకు ఇవి కొనసాగుతాయని కాకతీయ హెరిటేజ్ ట్రస్టు వ్యవస్థాపకులు ప్రొఫెసర్ పాండురంగారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పది రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమం కోసం జూన్ మొదటి వారం నుంచి ఆగస్టు 30వరకు దరఖాస్తులను ఆహ్వానించగా మొత్తం 180మంది భారతీయులు, 28 మంది విదేశీయులు ఆసక్తిని కనబర్చారని ఆయన పేర్కొన్నారు. ట్రస్టు నుంచి 30 మంది భారతీయులను, 10మంది విదేశీయులను ఎంపిక చేశామని వివరించారు. 30 మంది భారతీయులతోపాటు ఇరాన్ దేశానికి చెందిన ముగ్గురు వలంటీర్లు పాల్గొననున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ దివాకర హాజరుకానున్నారని వెల్లడించారు.

మేడిగడ్డకు 2.12లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మహదేవపూర్ రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. 2.12లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 85గేట్లను ఎత్తి, అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 3.40 మీటర్లు నమోదైంది.


ఐదు గుట్టల్లో మన ఆనవాళ్లు

ఆనాటి కొల్లాపూర్ నేటి కొలన్‌పల్లి



వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని కొలన్‌పల్లి గ్రామంలో ఉన్న బురుజు

- చరిత్రకు మారుపేరుగా నిలుస్తున్న గ్రామం
- పాలకుల నిర్లక్ష్యంతో తెలియకుండా పోతున్న చరిత్ర
- గుప్త నిధుల కోసం దుండగుల తవ్వకాలు
- పట్టించుకోని ప్రభుత్వం, పురావస్తు శాఖ అధికారులు



దేవుడి గుట్టపై ఉన్న రామాలయం

రాయపర్తి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : అందమైన, అతి సుందరమైన, ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు ఎటు చూసిన పచ్చని పంట పొలాలతో ఉండే గ్రామంలో గ్రామానికి ఎంతో విశిష్టతను తెచ్చే గుట్టలు ఇక్కడి ప్రాధాన్యత. వరుసగా ఒక్కో గుట్ట ఒక్కో ప్రాధాన్యంగా చెప్పుకుంటూ గ్రామానికి అభిముఖంగా ఉండే ఈ గుట్టల్లో ఏదో తెలియని వింతలతో పాటు ప్రజలకు చెప్పుకునే నిజాలు, జరిగిన సన్నివేశాలు, మాట్లాడుకునే పూర్వ కాలం నాటి విషయాలు దాగున్నాయి. ఆనాటి ఇంత వైభవం కలిగిన గుట్టలను గుర్తు తెలియని వ్యక్తులు దోచేస్తున్నారు. ఎంతో భక్తితో నిర్మించిన కట్టడాలను కాల గర్భంలో కలిపేస్తున్నారు. దేవుడి విగ్రహాలను ధ్వంసం చేయడమే కాకుండా ధ్వజ స్తంభాలను సైతం పగులగొట్టి ముక్కలు చేస్తున్నారు. పడిపోయిన శిథిలాలు, శాసనాలు, చెల్లాచెదురుగా పడి ఉన్న కట్టడాలు వాటి చరిత్రను రూపుమాపి దర్శనమిస్తున్నాయి. అదే వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని కొలన్‌పెల్లి ఒకప్పటి కొల్లాపూర్ పట్నం.

ఢిల్లీ సుల్తాన్, కాకతీయుల ఆనవాళ్లు...

ఢిల్లీ సుల్తాన్‌లు దేశాన్ని పరిపాలించిన కాలంలోనే ఈ గ్రామానికి రాజధానిగా హైదరాబాద్ దుండిగల్, తాలుకాగా రాయగిరి, పోలీస్‌స్టేషన్‌గా పెద్దపెండ్యాల ఉండేవని చరిత్రకారులతో పాటు ఇక్కడి వృద్ధులు చెపుతున్నారు. దఫేదారులు, జమానాలు గ్రామంలో పెద్ద బురుజును ఏర్పాటు చేసుకుని తమ పాలనను కొనసాగిస్తూ ప్రజల వద్ద శిస్తు వసూలు చేసేవారు. కాకతీయుల కట్టడాలు ఎక్కడా చెక్కు చెదరకుండా ఉన్నట్లే ఈ కొలన్‌పెల్లి గ్రామంలో కూడా అటువంటి రాతి కట్టడాలు కనిపిస్తాయి.

గుట్టల విశేషాలు ఇవే...

ఈ గ్రామానికి అందమైన ఐదు గుట్టలు ఊరికి అభిముఖంగా ఉన్నాయి. వీటి పేర్లు దేవుని గుట్ట, భైరేను గుట్ట, నూనేను గుట్ట, పెద్ద గుట్ట, ఎర్రబోడు గుట్ట. ఒక్కో గుట్టపై ఒక్కో దేవుడిని పూర్వ కాలంలో ఆరాధించేవారని, అందుకు నిదర్శనంగా ఆలయాలు సైతం ప్రస్తుతం కనిపిస్తున్నాయి. చెన్నకేశవ స్వామి దేవాలయం, లక్ష్మీనర్సింహస్వామి ఆలయం, శివాలయం, నాగులమ్మ గుడి, సీతమ్మ వారి పొల్లుగుంట, ఆంజనేయస్వామి ఆలయం, యాదవ, కురుమలు ఆదరించే భస్మదేవుడు, బయ్యాల దేవుడు ఈ గుట్టల్లో కొలువై ఉన్నారు. ఇక్కడ రాములవారి పాదాలు, గై(గుహ)గా పిలువ బడే మునీశ్వరుల గుట్ట అందరినీ ఆకర్షించేలా కనిపిస్తాయి. దేవుడి గుట్ట వద్ద ఎదురుగా ఉండే కొలను ఎల్లప్పుడు నిండి ఉండేదని ఎంతో పవిత్రంగా ఉండేదని ఈ కొలను ఆధారంగా గ్రామానికి కొలన్‌పెల్లి అని పేరు పెట్టినట్లు గ్రామస్థులు చెబుతున్నారు.

మునీశ్వరుడి గుట్టకు విశిష్టత...

గతంలో దేవుడి గుట్టపై పూజలు నిర్వహించే వారని, గ్రామానికి చెందిన వాసం లక్ష్మీనారాయణ అనే వ్యక్తి తదితరులు చిడతలను కొడుతూ పాటలు పాడుతూ గుట్టపై నిద్రించే వాడని అంటున్నారు. కొన్ని రోజులకు మునీశ్వరుడి అవతారంలో గడ్డాన్ని పెంచుకుని గ్రామస్థులకు కనబడకుండా భైరేను గుట్టలో ఉన్న సొరంగ మార్గంలోకి వెళ్లి రోజుల తరబడి తపస్సు చేసేవాడని చెబుతున్నారు. అందుకు ఈ గుట్టలకు మునీశ్వరుడి గుట్టగా పేరు వచ్చిందని, సొరంగ మార్గం ద్వారా వెళ్లే లోపలపెద్ద గుహలాగా ఉంటుందనిదానిలోకి వెళ్లే ధైర్యంలేక దానిని మూసి వేసినట్లు గ్రామస్థులు తెలిపారు. దేవుడి గుట్టకు దిగువ భాగాన ఉండే శివాలయం, నాగులమ్మ విగ్రహాలు, కొలనుకుఆనుకునిఉన్న సీతమ్మ పొల్లు గుంటకు ఎంతో విశిష్టత ఉందని గ్రామస్థులు తెలిపారు.

భద్రాద్రికి వెళ్తుండగా...

పూర్వకాలంలో సీతారాములు భద్రాద్రికి వెళ్తుండగా కొలన్‌పెల్లి గ్రామం అటవీ ప్రాంతం కావడంతో దేవుడి గుట్ట వద్ద విడిది చేశారని అప్పుడు ఈ కొలను వద్ద రాముడు పాదాలు మోపారని గ్రామస్థులు చెపుతున్నారు. అలాగే సీతమ్మ వారు లవకుశలను జన్మనిచ్చినప్పుడు లవకుశుల బొడ్డును సైతం తొలగించి కోనేట్లో వేయడంతో దీనిని గొల్లుకుంట అంటారని చెప్పారు. పొల్లు కుంట వద్ద సీతాదేవి పరమ శివుడిని స్మరిస్తూ ఉన్న ఆకారంలో ఉండే లింగం కూడా ఉంది. సీతారాముల వారిని కూడా ఇక్కడే పరమశివుడు, మహావిష్ణువును స్మరిస్తూ కాశీకావడిని ఏర్పాటు చేసి వారిని భుజాలపై మోశాడని దానికి సంబంధించిన గుర్తులు సైతం కనిపిస్తాయని గ్రామస్థులు తెలిపారు. అదేవిధంగా ప్రతి శనివారం గుట్టపైకి వెళ్లే వారికి పెద్ద నాగ సర్పం కనిపిస్తుందని పూర్వీకులు చెపుతున్నారు. స్వామి వారు కలలోకి వచ్చి ఆలయంలో పూజలు నిర్వహించండని, విగ్రహాలను పునఃప్రతిష్ఠించాలని తెలిపినట్లు, గ్రామంలో శుభాలు జరుగుతాయని చెప్పడంతో కొన్ని రోజుల పాటు ప్రతి శనివారం దేవుడి గుట్ట పూజలు నిర్వహించేవారని చెపుతున్నారు.

దేవుడి గుట్టకు ఎదురుగా కొలనులో ఆలయానికి సంబంధించిన విగ్రహాలు,శిథిలాలు, వివిధ రాతి కట్టడాలు ఉన్నాయని గ్రామంలోని వేద పండితుడు చెబుతున్నారు.కొలనులో ఉపాధి హామీ పథకం కింద కూలీలతో తవ్వకాలు చేపట్టగా శివలింగం, నాగ స్వరూపాలు బయట పడ్డాయని అన్నారు. గడ్డపార లోపలికి సులభంగా వెళ్తుందని, నీరు ఊటలా పైకి వచ్చాయని తెలిపారు. తమ చిన్ననాటి కాలంలో చుట్టూ పక్కల గ్రామాల నుంచి చాలా మంది ప్రజలు మొక్కులు తీర్చుకోవడానికి జాతరలా బండ్లు కట్టుకుని వచ్చిపూజలు చేసే వారని వృద్ధులు తెలిపారు.

కాకతీయుల కట్టడం శిథిలావస్థకు చేరడంతో అందులో ఉన్న ఆలయంలో కొందరు దుండగులు తవ్వకాలు జరిపి దేవతామూర్తులను తొలగించి గుప్తనిధులు కాజేసినట్లు గ్రామస్థులు భావిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పూర్వ వైభవం తేవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



గుట్టకు దిగువగా ఉన్న శివాలయం, పక్కన నాగులమ్మ విగ్రహాలు



మునీశ్వరుల గుట్టలోకి వెళ్లి సొరంగ మార్గం

పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేయాలి



గుట్టలపై ఉన్న దేవాలయాలను కాపాడాలి. ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా మార్చాలి. ప్రజాప్రతినిదులు అధికారులు దీన్ని పర్యవేక్షించి తగు చర్యలు చేపట్టాలి. గ్రామంలో ఉన్న దేవాలయాల విశిష్టతను అందరికి చాటి చెప్పేలా చర్యలు తీసుకోవాలి.

- జక్కుల నర్సయ్య, కొలన్‌పెల్లి

ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలి




పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి గ్రామంలో ఉన్న ఐదు గుట్టలపై అధ్యయనం చేసేలా రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి అభివృద్ధి దిశగా చర్యలు తీసుకోవాలి. కాకతీయుల కట్టడాల్లో శిథిలావస్థకు చేరిన విగ్రహాలతో పాటు కొలనులో ఉన్న విగ్రహాలను శాసనాలను వెలికి తీసి పూర్వ వైభవం తీసుకురావాలి. పురావస్తు శాఖ అధికారులు సర్వే చేసి చారిత్రక సంపదను కాపాడాలి.

- కృష్ణమాచార్యులు, కొలన్‌పెల్లి

పిడుగు పాటుకో యాప్..

- పిడుగు రాకపై ముందే సూచన
- దామిని యాప్‌తో సత్ఫలితాలు



దామిని యాప్

స్టేషన్‌ఘన్‌పూర్‌టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వర్షాకాలం సీజన్‌లో ప్రతీరోజు ఎక్కడో ఒక చోట వానలు పడుతున్నాయి. వాన పడిన సమయంలో మెరుపులు, పిడుగులు పడుతూనే ఉన్నాయి. భారీ వర్షాలు కురిసే సమయంలో మెరుపులు వాటితో పాటే పిడుగులు పడడం సహజం. ఐతే పిడుగులు పడిన ప్రతీసారి ఎక్క డో అక్కడ ప్రాణ, ఆస్తి నష్టాలు జరగడం అంతే సహజం అయిపో యింది. పిడుగు పడడం ముందే తెలిస్తే ఈ ప్రమాదాలనుఎంతో కొంత అరికట్టవచ్చు. ఇప్పుడు పిడుగు పడే కొద్ది నిమిషాల ముందు హెచ్చరించే యాప్ కూడావచ్చేసింది. ఆ వివరాలు మీ కోసం..

దామిని యాప్..

వర్షం కురుస్తున్న సమయంలో పిడుగు పాటుకు గురి కాకుండా ఉండేందుకు సాంకేతికత అందుబాటులోకి వచ్చేసింది. కేంద్ర ఎర్త్ సైన్సెస్ మినిస్ట్రీఈ డిపార్ట్‌మెంట్ దామిని లైట్నింగ్ అలెర్ట్ యాప్‌ను అందుబాటులోకి తీసుకు వచ్చింది. గూగుల్ ప్లే స్టోర్‌లోకి వెళ్లి ఈ యాప్‌ను ఎవరైనా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. వాతావరణ సంబంధిత వివరాలతో పాటు మనం ఉంటున్న ప్రాంతంలో పిడుగు పడే 25 నిమిషాల ముందే సూచనను తెలుసుకోవచ్చు. ఇంగ్లీష్, తెలుగు భాషల్లో యాప్‌ను వినియోగించుకోవచ్చు. దీని కోసం లోకేషన్ వివరాలు తెలిపాల్సి ఉంటుంది.

పిడుగు పాటు నివారణకు జాగ్రత్తలు

యాప్ ద్వారా ఒక ప్రాంతంలో పిడుగు పడే అవకాశం ఉందని ముందే తెలిస్తే అక్కడ ఉన్న వారు వెంటనే పిడుగు పాటును తప్పించుకోవడానికి జాగ్రత్తలు తీసుకోవాలి. వర్షం కురుస్తున్న సమయంలో చెట్ల కిందకు వెళ్లరాదు. నీరు ఉండే ప్రాంతానికి, విద్యుత్ పోల్స్ వద్దకు కూడ వెళ్లకూడదు. పెద్దగా ఉండే చెట్లు పిడుగులను ఆకట్టుకుంటాయి. అందుకే ఎట్టి పరిస్థితిలో చెట్టు కిందకు వెళ్లకుండా దగ్గరలో ఉన్న ఇంటిలోకి వెళ్లడానికి ప్రయత్నించాలి. సమీపంలో ఇల్లు లేకపోతే వెంటనే నేలపై పడుకోవాలి. విద్యుత్‌తో ప్రత్యక్ష సంబంధం ఉండే సెల్ ఫోన్, కంప్యూటర్‌లకు, బైక్‌లు, ట్రాక్టర్లకు దూరంగా ఉండాలి. ఎలక్ట్రానిక్ పరికరాల స్విచ్‌లు తొలగించి ఆఫ్ చేయాలి. తలుపులు, కిటికీలు, ప్లంబింగ్, సింకులు, బాత్ టబ్‌ల వద్ద ఉండకూడదు. కాంక్రీట్ నేలపై, కాంక్రీట్ గోడలను ఆనుకుని పడుకోకూడదని నిపుణులు సూచిస్తున్నారు. వీటి ద్వారా మెరుపు ప్రయాణించే అవకాశాలు ఉంటాయి. ఉరుములతో కూడిన వర్షం ఉన్నప్పుడు స్నానం చేయరాదు. గిన్నెలు కడగవద్దని చెబుతున్నారు. ఇళ్లు, భవనాలపై పిడుగులు పడకుండా విద్యుత్ ఎర్తింగ్ సరిగా చేయించుకోవాలి.



పిడుగు పడి కాలిన విద్యుత్ వైర్లు(ఫైల్)

వ్యవసాయ మార్కెట్‌లో సాంకేతిక సమస్య

- సరుకుల కొనుగోళ్లలో జాప్యం
- ఇబ్బందులు పడిన రైతులు

వరంగల్ వ్యవసాయం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో సోమవారం సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో సరుకుల కొనుగోళ్లలో తీవ్ర జాప్యం జరిగింది. సరుకులకు తూకం వేసేటప్పుడు దడువాయిలు వినియోగించే పీవోఎస్ మిషన్లలో మారిన సాఫ్ట్‌వేర్‌పై అవగాహన లేకపోవడం, సాఫ్ట్‌వేర్ సరిగ్గా పనిచేయకపోవడంతో కొనుగోళ్లు నిలిచిపోయాయి. దీంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్కెటింగ్‌శాఖ అధికారుల తీరు బాగాలేదని మండిపడ్డారు. ఈ విషయాన్ని దడువాయిలు వెంటనే ఇన్‌చార్జి కార్యదర్శికి తెలిపారు. అయితే నూతన సాఫ్ట్‌వేర్‌పై అధికారులకు, దడువాయిలకు అవగాహన లేకపోవడంతో ఆయన సైతం ఏమీ చేయలేకపోయారు. చివరకు మార్కెట్ ఇన్‌చార్జి కార్యదర్శి రాము దడువాయిలకు చిట్టాబుక్ ఇచ్చి తూకం వేసిన వివరాలను అందులో నమోదు చేయాలని ఆదేశించారు. దీంతో రైతులు శాంతించారు. ఇక ముందు రైతులకు ఇబ్బంది లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



మంద కృష్ణమాదిగను సన్మానిస్తున్న వర్సిటీ ప్రొఫెసర్లు, మాదిగ నేతలు

ఎస్సీ వర్గీకరణ ఫలాలు అందరికీ అందాలి

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

కేయూ క్యాంపస్ అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ ఫలాలు దళితుల్లోని అన్ని వర్గాలకు అందాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ సూచించారు. సోమవారం కేయూ గణితశాస్త్ర విభాగంలో ఉమ్మడి వరంగల్ జిల్లా, కేయూ మాదిగ ఉద్యోగుల సంఘం (ఎంఈఎఫ్) అధ్యక్షకార్యదర్శులు డాక్టర్ పోడేటి శ్రీనివాస్, డాక్టర్ ఎన్.సుజాతల నేతృత్వంలో పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్న సందర్భంగా ఘన సన్మానం చేశారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో కృష్ణమాదిగ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎస్సీ వర్గీకరణ విద్య, ఉద్యోగాలతో పాటు అన్ని విభాగాల్లో అమలు జరిగేలా చూడాలన్నారు. అణగారిన వర్గాలకు అండగా నిలుస్తామన్నారు. 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటంలో అనేక అవాంతరాలను ఎదుర్కొన్నామని చెప్పారు. ఉద్యోగాల్లో, ప్రమోషన్లలలో ఎస్సీ వర్గీరణ జరుపాలని డిమాండ్ చేశారు. మాదిగ ఉద్యోగులు జాతి అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. పీడిత వర్గాలవిముక్తికి పోరాటాలు చేస్తామన్నారు. భారీ గజామాలతో ఘన సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ తాళ్లపల్లి మనోహర్, హాస్టల్స్ డైరెక్టర్‌ఎల్‌పీ రాజ్‌కుమార్, బీసీ నేత డాక్టర్ తాడూరి శాస్త్రి, డాక్టర్ పుల్లా శ్రీనివాస్, డాక్టర్ కొట్టే భాస్కర్, డాక్టర్ సంగాల ఎప్రామ్‌రాజ్, డాక్టర్ సంకినేని వెంకన్న, డాక్టర్ మంద వీరాస్వామి, ఎంఈఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దనయ్య, దిలీప్, డాక్టర్ మామిడి లింగయ్య, డాక్టర్ సిలివేరు రాజ్‌కుమార్, కుమ్మరి రాజయ్య, మంద రాజు, మంద శ్యామ్, బొక్క మొగిలి, బొచ్చు తిరుపతి, కుమ్మరి శ్రీనాథ్, డాక్టర్ ఎడ్ల ప్రభాకర్, సూపరింటెండెంట్ బొల్నేపాక ప్రభాకర్, డాక్టర్ గజ్జెల మల్లేశ్, డాక్టర్ వంగాల సుధాకర్, వడ్డెపల్లి మోహన్,డాక్టర్ పుల్లా కుమార్, డాక్టర్ కుమారస్వామి, బొక్క దయాకర్, ప్రవీణ్ కుమార్‌తోపాటు విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పాకాలలో త్వరలో సఫారి టూర్

- వన్యప్రాణుల మధ్య 2 గంటల ప్రయాణం
- పర్యాటకులకు పూర్తిస్థాయిలో కనువిందు

ఖానాపురం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : సహజ సిద్ధ అందాలకు నిలయమైన పాకాలను పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. పాకాలకు విచ్చేసే పర్యాటకుల సౌకర్యార్థం ఇప్పటికే పలు అభివృద్ధి పనులను చేపట్టింది. పాకాలకు ప్రధానంగా యువ పర్యాటకులను అధికంగా విచ్చేస్తుంటారు. పాకాలకు విచ్చేసే యువ పర్యాటకుల్లో జోష్ నింపేందుకు త్వరలో సఫారి టూర్ అందుబాటులోకి రానుంది. అటవీ శాఖ ఆధ్వర్యంలో రూ.28లక్షలతో సఫారి టూర్ రూపుదిద్దుకుంటున్నది. ఇప్పటికే సఫారి టూర్ కోసం రెండు వాహనాల కొనుగోలు పూర్తయింది. ఆధునీకీకరణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. అదేవిధంగా వర్షాలు తగ్గుముఖం పట్టగానే సఫారి ట్రాక్ నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి.

దట్టమైన అడివిలో 10 కిలోమీటర్లు

పాకాల దట్టమైన అడవి ప్రాంతంలో 10 కిలోమీటర్లు సఫారి టూర్ ఉండేవిధంగా అటవీ అధికారులు రోడ్ మ్యాప్‌ను సిద్ధంచేస్తున్నారు. చిలుకమ్మనగర్ సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి సఫారి వాహనంలో (7 గురికి పరిమితం) లోపలికి వెళ్లి అడవినంతా చుట్టేస్తూ మధ్యలో దుప్పులు, కొండగొర్రెలు, కణుజులు, కృష్ణ జింకలు, అడవి పందులు, నెమళ్లు, నక్కలు, తోడేళ్లు, అడవి పిల్లులతో పాటు వివిధ రకాల పక్షులను చూస్తూ టూర్‌ను కొనసాగించడం జరుగుతుంది. అదేవిధంగా అడవిలోపల, అటవీ జంతువులను, పక్షులను చూసే విధంగా అక్కడక్కడ వ్యూ లైన్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పాటు అడవి మధ్యలో వాచ్ టవర్లు ఏర్పాటు చేస్తున్నారు. పర్యాటకులు టవర్ ఎక్కి అడవిని పూర్తిగా వీక్షించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. అడవి మధ్యలో అక్కడక్కడ ఏర్పాటు చేసిన నీటి కుంటలలోని తాబేళ్లతో పర్యాటకులు సేద తీరేవిధంగా అటవీ అధికారులు సఫారి టూర్‌ను తీర్చిదిద్దుతున్నారు. రా కింగ్ మౌంటెన్ వద్ద సెల్ఫీ ఫొటోలు దిగేవిధంగా ఏర్పాటుచేస్తున్నారు. మొత్తంగా రెండు గంటల ప్రయాణం తరువాత పూర్తిస్థాయి సంతృప్తి చెందిన తరువాత సంగెం కాలువ సమీపంలో సఫారి టూర్ ముగియనుంది.





పాకాలలో సఫారి టూర్‌కు సిద్ధమయ్యే వాహనం (మోడల్), సఫారి టూర్ వెళ్లే మార్గంలో రాళ్లపై అటవీ జంతువుల బొమ్మలు

ఒక రోజు పర్యాటకానికి అడుగులు

పాకాలకు విచ్చేసే పర్యాటకులు పూర్తిగా ఒక రోజు గడిపే విధంగా అటవీ శాఖ అధికారులు ఏర్పాట్లు చేపడుతున్నారు. పాకాలలో బోటింగ్ చేయడంతో పాటు, ట్రెక్కింగ్, సఫారి టూర్, నైట్ క్యాంపెనింగ్ కలిపి ఒక రోజు పూర్తిగా పాకాలలో గడిపే విధంగా అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

నిధుల వెసులు బాటును బట్టి పనులను చేపడుతున్నామని అటవీ అధికారులు తెలుపుతున్నారు. నవంబర్ నెలలో సఫారి టూర్‌ను ప్రారంభించే విధంగా అధికారులు ఏర్పాట్లు చేపడుతున్నారు. సఫారి టూర్ అందుబాటులోకి వస్తే పర్యాటకులకు మంచి కనువిందు కానుంది.

పాకాల పర్యాటకంపై ప్రత్యేక దృష్టి



పాకాలను పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే లక్షల రూపాయల నిధులు వెచ్చించి పలు అభివృద్ధి పనులను చేపట్టాం. ఇటీవల బోటింగ్ పాయింట్‌ను అభివృద్ధి చేయడంతో పాటు, చిన్నపిల్లలకు ప్లేయింగ్ ఏరియాను అందుబాటులోకి తీసుకువచ్చాం. బట్టర్‌ఫ్లై గార్డెన్ ఆధునీకీకరణ చేపట్టాం. బ్యాటరీ వాహనం కొనుగోలు చేశాం. కట్ట పొడవునా సీసీ రోడ్డు నిర్మాణం జరుగుతున్నది. వర్షాలు తగ్గగానే సఫారి టూర్‌ను ప్రారంభిస్తాం. సఫారిటూర్‌తో పర్యాటకుల సంఖ్య బాగా పెరిగే అవకాశం ఉంది.

- రవికిరణ్, నర్సంపేట ఎఫ్ఆర్వో

కేయూ 2010 బ్యాచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్లకు తీపికబురు..

- ప్రమోషన్లు ఇచ్చేందుకు పాలకమండలి ఆమోదం
- కాంట్రాక్టు అధ్యాపకుల రిటైర్‌మెంట్ వయస్సు పెంపు
- పార్టుటైమ్ అధ్యాపకుల నియామకాలకు పచ్చజెండా
- వర్సిటీ కాంపౌండ్ వాల్ నిర్మాణానికి ఒకే..

కేయూ క్యాంపస్ అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీలో 2010లో నియామకమైన అసిస్టెంట్ ప్రొఫెసర్లకు తీపికబురు వచ్చింది. కోర్టు కేసుల నేపథ్యంలో సుదీర్ఘకాలంగా ప్రమోషన్లకు నోచుకోలేకపోయిన అసిస్టెంట్ ప్రొఫెసర్లకు కేరీర్ అడ్వాన్స్ స్కీం (క్యాష్) ప్రమోషన్లు ఇచ్చేందుకు వర్సిటీ పాలక మండలి అమోదం తెలిపింది. సోమవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సెక్రటేరీయట్‌లో కేయూ పాలక మండలి సమావేశం జరిగింది. కేయూ వీసీ, పాలక మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ యోగితారాణా, ఉన్నత విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవాసేన, పాలక మండలి సభ్యులు ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, డాక్టర్ నిమ్మ సుదర్శన్, డాక్టర్ చిర్రా రాజుగౌడ్, బొద్దిరెడ్డి రమాదేవి, సుకుమారి, మల్లం నవీన్, బాలు చౌహాన్, డాక్టర్ కరుకాల అనితారెడ్డిలు హాజరైయ్యారు.ఈ సందర్భంగా 2010 బ్యాచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్లకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు,కోర్టు ఉత్తర్వుల మేరకు ప్రమోషన్ల కల్పించాలని నిర్ణయించారు. అలాగే వర్సిటీ చుట్టూ కంపోండ్ వాల్ నిర్మాణానికి రూ.20లక్షలను కేటాయించారు. వర్సిటీ పరిధిలో పార్టుటైమ్ అధ్యాపకుల నియామకాల కోసం వర్సిటీ పాలక మండలి పచ్చజెండా ఊపింది. వర్సిటీ నియామ నిబంధనల మేరకు అధ్యాపకుల అవసరాల రీత్యా 130 మందిని వివిధ విభాగాల్లో పార్టుటైమ్ టీచింగ్ ఏర్పాట్లు చేసుకోవాలని నిర్ణయించారు. కాంట్రాక్టు అధ్యాపకుల పదవీ విరమణ వయస్సు 65 ఏళ్లకు పెంచిన ఉత్తర్వులకు ఆమోదం తెలిపింది. ఉద్యోగులు మరణిస్తే వారి అంత్యక్రియలకు రూ.20వేల నుంచి రూ.30 వేలకు పెంచారు. భూ కబ్జాల వివాదంతో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొని సస్పెన్షన్‌కు గురైన అసిస్టెంట్ రిజిస్ట్రార్ పెండ్లి అశోక్‌బాబును మళ్ళీ విధుల్లోకి తీసుకోవాలని నిర్ణయించారు. అయితే అశోక్ బాబును విధుల్లోకి తీసుకుంటూనే డిమోషన్ చేస్తారనే ప్రచారం వర్సిటీలో కొనసాగుతోంది. అశోక్‌బాబుతో పాటు భూ ఆరోపణలు ఎదుర్కొంటున్న అందరికీ ఉద్యోగాలు మళ్ళీ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. అయితే వర్సిటీ క్యాంపస్‌లో అశోక్‌బాబును విధుల్లోకి తీసుకోకుండా అనుబంధ కళాశాలల్లో పనిచేసే విధంగా సూచనలు చేసినట్లు తెలుస్తోంది.

కొత్త పీహెచ్‌డీ అడ్మిషన్లపై సస్పెన్స్..

సోమవారం హైదరాబాద్‌లో జరిగిన పాలక మండలి సమావేశంలో కేయూలో వివిధ విభాగాల్లో నూతనంగా పీహెచ్‌డీ అడ్మిషన్ల నిర్ణయం తీసుకుంటారని భావించినప్పటికీ ఏ నిర్ణయం తీసుకోకుండా సస్పెన్స్‌లో పెట్టినట్లు తెలుస్తోంది. పీహెచ్‌డీ అడ్మిషన్లపై వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం నియమించిన కమిటీ తుది నివేదిక అందచేయకపోవడంతో పాలక మండలి అడ్మిషన్ల విషయాన్ని తాత్కాలికంగా పక్కన పెట్టాలని సూచించినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా కేయూ యూజీసీ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ రాగి మల్లికార్జున్‌రెడ్డి, ఇతర సిబ్బంది,రాష్ట్ర విద్యాశాఖ అధికారుల నేతృత్వంలో రూసా అభివృద్ధిపనులపైనా ప్రత్యేకంగా సమావేశం జరిగింది. వర్సిటీ ఉన్నతాధికారులు, డీఆర్‌లు, ఏఆర్‌లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బాకీ కార్డులతో నిలదీయండి

కొత్తగూడ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు పరచాలని డిమాండ్ చేస్తూ బాకీ కార్డులతో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలని బీఆర్ఎస్ మండల నాయకుడు, మాజీ ఉప సర్పంచ్ గుగులోత్ సురేష్ నాయక్ పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన పిలుపులో భాగంగా కొత్తగూడ మండలంలోని తాటివారివేంపల్లి, మాసంపల్లి గ్రామా ల్లో మాజీ ఉప సర్పంచ్ గుగులోత్ సురేష్, నాయకులు సోమవారం బాకీ కార్డులను పంపిణీ చేశారు.

గోర్ సిక్వాడీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా హరిలాల్



నెహ్రూసెంటర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): గోర్ సిక్వాడీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బోడ హరిలాల్‌నాయక్‌ను ఏకగ్రీవంగా నియమించినట్లు గోర్ సిక్వాడీ జాతీయ అధ్యక్షుడు రాజేంద్రచౌహాన్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని ఘట్‌కేసర్ మండలం ఎన్ఎఫ్‌ఎసీనగర్‌లో గోర్ సిక్వాడీ రాష్ట్రస్థాయి జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఇందులో మహబూబాబాద్ జిల్లా మల్యాల శివారు రేగడితండాకు చెందిన బోడ హరిలాల్‌నాయక్‌ను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు ఆయన పేర్కొన్నారు. హరిలాల్‌నాయక్ అనేక సంవత్సరాలుగా సేవాలాల్ మహరాజ్ చూపిన మార్గంలో నడుస్తూ బంజార జాతిని చైతన్యం చేస్తూ ప్రతి పోరాటంలో ముందున్నారన్నారు. ఈ సందర్భంగా హరిలాల్‌నాయక్ మాట్లాడుతూ తన నియామకానికి కృషి చేసిన జిల్లా, రాష్ట్ర, జాతీయ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. గోర్ సిక్వాడీ వేదిక తరుపున బంజారాల కోసం జరిగే పోరాటంలో కీలక పాత్ర పోషించి ముందుంటానన్నారు.

కేసముద్రంలో నాలుగు చోట్ల సీపీఐ పోటీ

కేసముద్రం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో కేసముద్రం మండలంలో నాలుగు చొప్పున ఎంపీటీసీ, సర్పంచ్, 50 వార్డు సభ్యుల స్థానాల్లో సీపీఐ అభ్యర్థులు పోటీ చేస్తారని ఆ పార్టీ జిల్లా, నియోజకవర్గ కార్యదర్శులు బి.వి జయసారథి, అజయ్‌సారథిరెడ్డిలు తెలిపారు. కేసముద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో కలిసి పనిచేశామని, స్థానికంలో కూడా ఆ పార్టీతో చర్చలు సాగుతున్నట్లు తెలిపారు. నిత్యం ప్రజల కోసం శ్రమించే సీపీఐ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సమావేశంలో మండల కన్వీనర్ చొప్పరి శేఖర్, మంద భాస్కర్, మండ శ్రీను, మడత నారాయణ, పూజారి రవి, కొట్టం ఉపేందర్, వడ్డెబోయిన లక్ష్మీనర్సయ్య, గురవయ్య, వీరస్వామి, కరుణాకర్ పాల్గొన్నారు.

కవి యాకమ్మకు ఘన సన్మానం



కవి యాకమ్మను సన్మానిస్తున్న నర్సింహారెడ్డి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ రవీంద్రభారతిలో ఆదివారం రాత్రి కవి, రచయిత్రి డాక్టర్ తాళ్లపల్లి యాకమ్మను ఘనం గా సన్మానించారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ దక్కన్ సభ సహకారంతో 40 మంది రచయితలు రాసిన 'తెలంగాణ వైభవం - మహిళా చైతన్యం' వ్యాసాల గ్రంథావిష్కరణలో మహబూబాబాద్ పట్టణ కేంద్రానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు కవి, రచయిత్రి డాక్టర్ తాళ్లపల్లి యాకమ్మ రాసిన వీరనారి చాకలి ఐలమ్మ వ్యాసానికి చోటుదక్కింది. ఇందుకు గాను యాకమ్మను తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ కార్యదర్శి డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వెల్దండిశ్రీధర్, రాజీవ, చాయారతన్, బండారుసుజాత, మామిడాల శైలజ, ఊర్మిళ, సునంద, రచయితలు, కవులు, కళాకారులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులకు ఘన సన్మానం



కాంపెల్లి జడ్పీఎస్ఎస్‌లో పూర్వ విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కురవి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): సీరోలు మండలం కాంపెల్లి జడ్పీఎస్ఎస్ పాఠశాలలో చదివి వివిధ రంగాల్లో ప్రతిభ చాటిన పూర్వ విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయ బృందం సోమవారం ఘనంగా సన్మానించింది. జాతీయ పుట్‌బాల్ జట్టుకు ఎంపికైన మద్దినాల లావణ్య, ఎంబీబీఎస్ సీటు సాధించిన మేకల లిఖిత, గ్రూప్-2లో ఎంపీవో ఉద్యోగం సాధించిన సీరోలు గ్రామానికి చెందిన పోగుల వినయ్‌లను ఉపాధ్యాయులు శాలువాలు, మెమోంటోలతో సత్కరించారు. ఈ సందర్భంగా హెచ్ఎం డోలి అరుణశ్రీ మాట్లాడుతూ.. ప్రతిభ చాటిన పూర్వ విద్యార్థులను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ఉన్నత స్థానాలను అధిరోహించాలన్నారు.

పార్టీలు నిబంధనల మేరకే నడుచుకోవాలి

డోర్నకల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజకీయ పార్టీలు ఎన్నికల నియమ నిబంధనల మేరకు నడుచుకోవాలని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. డోర్నకల్‌లోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం వివిధ రాజకీయ పార్టీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో పోటీ చేసే పార్టీల అభ్యర్థులు ఎన్నికల నియమావళికి కట్టుబడి ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు మండలంలోని ఏదైనా ఒక ఎంపీటీసీ నుంచి ఓటుహక్కు కలిగి ఉండాలని, జడ్పీటీసీకి పోటీ చేసే అభ్యర్థులకు సైతం ఇదే నియమం వర్తిస్తుందని, కానీ వారు ఏ జడ్పీటీసీ ప్రాదేశిక నియోజకవర్గం నుంచైనా పోటీ చేయవచ్చునని అన్నారు. ఎంపీటీసీకి పోటీ చేసే అభ్యర్థులు మండలంలోని ఎంపీటీసీ ప్రాదేశిక నియోజకవర్గంలో పోటీ చేయవచ్చన్నారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేక అధికారి నర్సింహమూర్తి, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించాలని డీఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి కేలోతు సామికుమార్, కోశాధికారి గుగులోతు సూర్యప్రకాష్ డిమాండ్ చేశారు. మహబూబాబాద్‌లోని కలెక్టరేట్ ఎదుట సోమవారం విద్యార్థులతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బయ్యారం ఏజెన్సీ మండలం మొట్లగూడెం ప్రాథమిక పాఠశాలలో 20 మంది విద్యార్థులుండగా ఉపాధ్యాయుల కొరత ఉందన్నారు. మా పాఠశాల పిల్లలకు గురువులు కావాలనే నినాదాలతో తల్లిదండ్రులు, చిన్నారులు ప్లకార్డులతో నిరసన తెలిపారన్నారు. సంబంధిత విద్యాశాఖ అధికారులు ఇప్పటికైనా పాఠశాలకు ఉపాధ్యాయులను కేటాయించి యూనిఫాం, మధ్యాహ్న భోజనం అందించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం సదరు డిమాండ్‌తో కూడిన వినతి పత్రం డీఈవోకు అందజేశారు.

మొక్కజొన్నకు 'మద్దతు' కరువు

- వానలతో దెబ్బతింటున్న నాణ్యత
- క్వింటాకు రూ.1960 నుంచి రూ.2090 మధ్య ధరలు



కేసముద్రం మార్కెట్‌కు విక్రయానికి వచ్చిన మొక్కజొన్నలు

కేసముద్రం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు విక్రయానికి తీసుకువస్తున్న మొక్కజొన్నలకు వర్షాల ప్రభావంతో ప్రభుత్వ మద్దతు ధర కరువైంది. ఏడు రోజుల సెలవుల అనంతరం సోమవారం మార్కెట్‌కు 87 మంది రైతులు 3,707 బస్తాల్లో 2,224 క్వింటాళ్ల మొక్కజొన్నలు విక్రయానికి తీసుకవచ్చారు. ఎలక్ట్రానిక్ నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్(ఈ-నామ్) విధానంలోని 'ఈ-వేలం'లో మొక్కజొన్నక్వింటాకు గరిష్ఠంగా రూ.2,109, కనిష్ఠంగా రూ.1,851, సగటున రూ.2,059 ధరలతో వ్యాపారులు ఖరీదులు చేశారు. గత మూడు వారాలుగా ఈ మార్కెట్లో మొక్కజొన్న క్వింటాల్‌కు సగటున రూ.1,960 నుంచి రూ.2,090 ధరలతో వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. 14శాతం కంటే తక్కువ తేమతో నాణ్యమైన మొక్కజొన్నలకుసైతం రూ.2,100 నుంచి రూ.2,150 వరకే ధర వస్తోంది. మొక్కజొన్నకు ప్రభుత్వ కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ) క్వింటాకు రూ.2,400 ఉండగా నాణ్యత ఉన్న సరుకును కూడా అంతకంటే తక్కువ ధరలకే కొనుగోలు చేస్తున్నారు. సాధారణంగా మార్కెట్‌కు ఖరీఫ్ సీజన్ మొక్కజొన్నలు నవంబరు మొదటి వారంలో ప్రారంభమవుతాయి. ప్రస్తుతం ఒక నెల ముందుగా విత్తనాలు వేసిన రైతుల ఉత్పత్తులు మార్కెట్‌కు వస్తున్నాయి.

వరుస వర్షాలతో దెబ్బతింటున్న నాణ్యత

వరుసగా కురుస్తున్న వర్షాలు మొక్కజొన్న పంట నాణ్యతను తీవ్రంగా దెబ్బతీస్తున్నట్లు వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. కోత సమయంలో వర్షాల కారణంగా గింజలకు బూజు రావడం, ముసురు పడితే మొక్కలపైనే కంకులపై గింజలు మొలకెత్తిన సందర్భాలు కూడా ఉన్నాయి. గతంలో పసుపులో అంతర పంటగా మొక్కజొన్న సాగు చేసి అదనపు ఆదాయంగా చూసేవారు. ప్రస్తుతం పసుపు పంట కనుమరుగు కావడంతో వానాకాలం ప్రధాన పంటగా మొక్కజొన్న మారింది. ఈ క్రమంలో మొక్కజొన్నలకు నాణ్యత లేకపోవడంతో మార్కెట్లో మెరుగైన ధరలు రావడం లేదు. మార్కెట్‌కు ఒక వెయ్యి నుంచి 2వేల బస్తాల వరకే మొక్కజొన్నలు వస్తున్నాయి. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అవసరమయ్యే సరుకు, కావాల్సిన నాణ్యత లేకపోవడంతో ఈ కేంద్రాల ఏర్పాటుకు మరికొన్ని రోజులు పట్టే అవకాశం ఉంది. ఏదేమైనా వరుస వర్షాలతో మొక్కజొన్న నాణ్యత దెబ్బతిని ధరలపై ప్రభావం చూపుతోంది.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం : కేజీకేఎస్



సమావేశంలో మాట్లాడుతున్న గౌని వెంకన్న

డోర్నకల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కల్లుగీత కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గౌని వెంకన్న అన్నారు. మండలంలోని గొల్లచర్లలో సాయి గార్డెన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన కల్లుగీత కార్మిక సంఘం మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వానికి పలుమార్లు వినతిపత్రాలు అందించినా కల్లుగీత కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తుందని పేర్కొన్నారు. కాటమయ్య రక్షణ కవచాల కిట్లు ఏడాదికి 20వేలకు మించి ఇవ్వడం లేదని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం.. గీత కార్మికులకు నెలకు రూ.4వేల పింఛన్, ప్రమాద బీమా ఎక్స్‌గ్రేషియా రూ.10 లక్షలు ఇవ్వాలన్నారు. అలాగే మద్యం షాపుల్లో 25 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. ఈసమావేశంలో జిల్లా అధ్యక్షుడు యమగాని వెంకన్న, మరిపెడ, డోర్నకల్ మండలాల కార్యదర్శులు మొగుళ్ల యాకన్న, మేకపోతుల అంజయ్య, నాయకులు గాదె నాగేశ్వర్‌రావు, గంధసిరి శ్రీనివాస్, తండ కర్ణ, సమ్మెట శ్రీనివాస్, చేవుగాని రాంబాబు, లక్ష్మీనారాయణ, బొంపెల్లి శ్రీను, నాయకులు పాల్గొన్నారు.

ప్రజల పక్షాన నిలిచే ఎంసీపీఐని గెలిపించాలి

కేసముద్రం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజా పోరాటాలు చేస్తూ వారి పక్షాన నిలిచే ఎంసీపీఐ అభ్యర్థులనే గెలిపించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పానుగంటి నర్సయ్య కోరారు. కేసముద్రం విలేజిలో సోమవారం ఉల్లి ప్రతాప్ అధ్యక్షతన పార్టీ జిల్లా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ జిల్లాలో మూడు జడ్పీటీసీ, 10 ఎంపీటీసీ స్థానాల్లో తమ పార్టీ తరపున అభ్యర్థులను పోటీ చేయించనున్నట్లు తెలిపారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు మర్రిపెల్లి మొగిలి, జాటోత్ బిచ్యా నాయక్, ఇరుప ప్రియాంక, లాలు, సుగుణ, లింబ, వి.మొగిలి, శ్రీను, కిషన్, ఎల్లమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

- జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



ముత్యాలమ్మగూడెం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరిశీలిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్ రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు రుచికరమైన భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. మహబూబాబాద్ మండలంలోని ముత్యాలమ్మగూడెం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, కంబాలపల్లి ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను సోమవారం ఆకస్మికంగా సందర్శించి కిచెన్ షెడ్, డైనింగ్ హాల్, మరుగుదొడ్లు, లైబ్రరీ, తరగతి గదులు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ మాట్లాడుతూ... విద్యార్థుల వివరాలు, అభ్యసన సామర్థ్యాలు, పాఠ్యాంశాలపై విద్యార్థులను ప్రశ్నలు అడిగారు. క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరు కావాలని సూచించారు. షెడ్యూల్ ప్రకారం డిజిటల్ తరగతులు, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా పాఠ్యాంశాలను పూర్తి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేలా పాఠ్యాంశాలను బోధించాలన్నారు. విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి వారి మానసిక ఆరోగ్య స్థితిగతులను నిత్యం గమనిస్తుండాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ నిత్యం శానిటేషన్ పనులు చేయించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.

కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలి

- ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య




బయ్యారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

బయ్యారం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎన్నికల్లో ఎవరికి టికెట్ వచ్చినా కార్యకర్తలందరు కలిసికట్టుగా పనిచేసి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పిలుపునిచ్చారు. సోమవారం బయ్యారంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల స్థానిక సంస్థల సన్నాహక సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. మండలంలోని 12 ఎంపీటీసీ స్థానాలతో పాటు ఒక జడ్పీటీసీ స్థానాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకునేలా పని చేయాలన్నారు. ప్రజా ప్రభుత్వంలో ఇళ్లు, రేషన్ కార్డులు, సన్న బియ్యం, ఉచిత విద్యుత్ నిరంతరం కొనసాగే ప్రక్రియ అన్నారు. యూరియా విషయంలో రైతులను ప్రతిపక్ష పార్టీలు తప్పుదోవ పట్టిస్తున్నాయన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలి

- గార్ల(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పిలుపునిచ్చారు. సోమవారం గార్లలోని స్థానిక వర్తక సంఘం భవనంలో ఏర్పాటుచేసిన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామాల్లో ప్రజలకు వివరించి కాంగ్రెస్ సత్తా చాటాలన్నారు. గ్రామంలో ఎవరి టికెట్ కేటాయించినా అందరు కలిసికట్టుగా కష్టపడి పనిచేసి గెలిపించాలన్నారు. వర్గ విభేదాలకు తావులేకుండా పనిచేసి అత్యధిక స్థానాలు గెలిపించుకోవాలన్నారు. గ్రామాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలిపిస్తేనే పల్లె సీమలు అభివృద్ధి చెందుతాయన్నారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, మాజీ ఎంపీపీ మాలోత్ వెంకట్‌లాల్ నాయక్, మాజీ జడ్పీటీసీ జాటోత్ ఝాన్సీలక్ష్మి, గుండా వెంకటరెడ్డి, తాళ్లపల్లి కృష్ణగౌడ్,దనియాకుల రామారావు, మండా రాము గౌడ్, కట్టా శ్రీనివాస్‌రావు, భూక్యా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

యువత సాధికారత సాధించాలి



డోర్నకల్ సీఎస్ఐ చర్చి వద్ద ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న బిషప్ పద్మారావు, ఎమ్మెల్యే కోరం కనకయ్య

డోర్నకల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): యువత వివిధ రంగాలలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకుని సాధికారత వైపు దృష్టి సారించాలని డోర్నకల్ సీఎస్ఐ చర్చి బిషప్ కోడిరెక్క పద్మారావు, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. డోర్నకల్‌లోని సీఎస్ఐ చర్చి నుంచి రైల్వే సెంటర్ వరకు యువతీ యువకులు నిర్వహించిన ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. నెట్‌వర్కింగ్, టెక్నాలజీ, ఎంటర్‌టైన్‌మెంట్, హౌసింగ్, ట్రాన్స్‌పోర్టు, లైవ్లీహుడ్, నేషనల్ ఫార్మేషన్, ఎడ్యుకేషన్, ఎనర్జీ హెల్త్ మొదలైన పది కీలక రంగాలలో ఉపాధి కోసం ఎన్నో అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఆయా రంగాలలో నైపుణ్యత సాధించడం ద్వారా సాధికారత పొంది తద్వారా 2047 వరకు దేశాన్ని ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా రూపొందేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈస్టా సొసైటీ బాధ్యులు అచ్యుతరావు, సచిన్, విజయపద్మారావు, ఓలేటి జ్యోతి, తనుశ్రీ, కిరణ్‌కుమార్, లవన్, భిక్షం, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు అంతర్‌రాష్ట్ర మహిళా దొంగల అరెస్టు

- వివరాలు వెల్లడించిన సీఐ మహేందర్‌రెడ్డి

మహబూబాబాద్ క్రైం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ పట్టణంలోని ఓ జ్యువెలరీ షాపులో చోరీకి పాల్పడిన ముగ్గురు అంతర్‌రాష్ట్ర మహిళా దొంగలను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు టౌన్ సీఐ జి.మహేందర్‌రెడ్డి తెలిపారు. మహబూబాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం సీఐ నిందితులను అరెస్టు చూపి వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎన్టీఆర్ జిల్లా వేర్లపాడు మండలం గోకరాజుపల్లి గ్రామానికి చెందిన బాలసాని నాగమణి, అదే గ్రామానికి చెందిన మేచర్ల రేణుక, ఖమ్మం జిల్లా మధిర మండలం రాయపట్నం గ్రామానికి చెందిన బొజ్జగాని నాగేంద్రమ్మలు ముఠాగా ఏర్పడి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా ఈనెల 4న పట్టణంలోని ఓ జ్యువెలరీ దుకాణంలో బంగారు నగలు కొనుగోలు చేసేందుకు వెళ్లారు. ఒరిజినల్ బంగారు చెవికమ్మలు తీసుకొని రిటన్‌లో నకిలీవి(రోల్ గోల్డ్) మారుస్తున్న క్రమంలో జ్యువెలరీ దుకాణం యజమాని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు ఆ ముగ్గురు మహిళలను అదుపులోకి తీసుకొని విచారించగా 2.5 గ్రాముల బంగారు చెవికమ్మలు అపహరించినట్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. వీరు భద్రాద్రి కొత్తగూడెం, పాల్వంచ, నకిరేకల్ పట్టణాల్లో పలు దొంగతనాలు పాల్పడినట్లు అక్కడి పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదైనట్లు చెప్పారు. వారి వద్ద నుంచి 2.5 గ్రాముల బంగారు చెవికమ్మలు రికవరీ చేసి అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ పేర్కొన్నారు. సమావేశంలో ఎస్సైలు ప్రశాంత్, అలీ హుస్సేన్, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ 'డీల'ర్లు

(3వ పేజీ తరువాయి)

రావాల్సి ఉంది. దసరా పండుగ ఖర్చులకు అయినా డబ్బులు చేతిలో పడుతాయనే ఆశతో డీలర్లు ఉండగా కేంద్రం కిమ్మన లేదు. అక్టోబరు నెల కూడా రావడంతో ఆరు నెలల కమీషన్ బకాయిలు అందక డీలర్లు అప్పుల పాలవుతున్నారు. షాపుల అద్దెలు చెల్లించని దుస్థితిలో ఉన్నామంటూ వాపోతున్నారు.

ముఖ్యమంత్రికి విజ్ఞప్తి..

ఇటీవలే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని తెలంగాణ రేషన్ డీలర్స్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రమేశ్‌బాబు, తదితర ప్రతినిధులు హైదరాబాద్‌లో కలిశారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రిని కలిసిన అసోసియేషన్ ప్రతినిధులు కమీషన్ విడుదలను ప్రస్తావించారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి విడుదల చేయించాలని కోరారు. అదే విధంగా అపరిష్కృతంగా ఉన్న తమ డిమాండ్లను పరిష్కరించాలని విన్నవించారు. ఇప్పటికీ కమీషన్ డబ్బులు రాకపోవడంతో మరోసారి ముఖ్యమంత్రిని కలువాలని డీలర్లు భావిస్తున్నారు. తమ పరిస్థితిని వివరించి కేంద్రంపై మరింత ఒత్తిడి తెచ్చేలా చూడాలని ముఖ్యమంత్రిని వేడుకోనున్నట్లు డీలర్లు చెబుతున్నారు.

కష్టపడే వారికే టికెట్ ఇవ్వాలి

- బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ యాసం రమేష్

నెల్లికుదురు, అక్టోబరు 6 (అంధ్రజ్యోతి): బీఆర్ఎస్‌లో కష్టపడి పని చేసిన వారికే స్థానిక సంస్థల ఎన్నికల్లో జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ టికెట్లు ఇవ్వాలని బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ యాసం రమేష్, మండల మాజీ అధ్యక్షుడు ఆకుల జగ్గయ్య తెలిపారు. మండలకేంద్రంలో సోమవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ ఏకపక్ష నిర్ణయాలతో టికెట్లు ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. అట్టి నిర్ణయాన్ని మార్చుకోవాలని అన్నారు. మండల కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసుకోవాలన్నారు. గత 20 ఏళ్లుగా పార్టీలో పనిచేసిన వారికే జడ్పీటీసీ టికెట్‌లు ఇవ్వాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలువాలంటే కార్యకర్తల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు వీరగాని మల్లేశం, బత్తిని అజయ్, తూళ్ల వివేక్ ఆకుల మల్లేష్, శ్రీరాం సత్యనారాయణ, వెంకటాచారి, చిప్ప సమ్మయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ హవా

- ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్




బయ్యారంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్

బయ్యారం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి):స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల హవా కొనసాగనున్నట్లు ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్ తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో సోమవారం బయ్యారం, కొత్తపేట, వెంకట్రాపురం గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశాలు జరిగాయి. వీటికి హాజరైన హరిప్రియ నాయక్ స్థానిక ఎన్నికల్లో అభ్యర్థుల విజయం కోసం కార్యకర్తలందరు కలిసికట్టుగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. మండలంలోని 12 ఎంపీటీసీ స్థానాలతో పాటు జడ్పీటీసీ స్థానాన్ని కైవసం చేసుకునేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సమావేశాల్లో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి

- యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సురేష్‌నాయక్
- ఘనంగా ఎమ్మెల్యే మురళీనాయక్ జన్మదిన వేడుకలు



మహబూబాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రక్తదాన శిబిరంలో పాల్గొన్న యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజ్మీర సురేష్‌నాయక్

మహబూబాబాద్ రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : రక్తదానం చేసి మరొకరికి ప్రాణదాతలు కావాలని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అజ్మీర సురేష్‌నాయక్ అన్నారు. మహబూబాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ జన్మదినాన్ని పురస్కరించుకొని యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గాడిపెల్లి చరణ్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో 54 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా సురేష్‌నాయక్ మాట్లాడుతూ... మహబూబాబాద్ నియోజకవర్గంలో ఎప్పుడూ లేని విధంగా 52వేల పైచిలుకు మెజారిటీతో గెలుపొందిన కాంగ్రెస్ అభ్యర్థి భూక్య మురళీనాయక్ పుట్టిన రోజున మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. రక్తదానం చేయడం వలన ఎలాంటి ఇబ్బంది ఉండదని, ఆపదలో ఉన్న వ్యక్తి ప్రాణాలను కాపాడేందుకు ఉపయోగ పడుతుందన్నారు. అనంతరం నెహ్రూ సెంటర్, ఫారెస్ట్ సెంటర్లలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తొలుత కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాంపెల్లి నవీన్, మహేందర్, మండల పార్టీ అధ్యక్షుడు మిట్ట కంటి రాంరెడ్డి, దేవరం ప్రకాష్‌రెడ్డి, సీరుటి లక్ష్మీనారాయణ, అంబటి మహేందర్‌రెడ్డి, ఎడ్ల రమేష్, గునిగంటి కమలాకర్, ఖలీల్, నర్సింగ శ్రీనివాస్, చిట్టి వెంకటేశ్వర్లు, బెల్లంకొండ శ్రీనివాస్, గార్లపాటి సాయి తేజ, రవీంద్రాచారి, పోతురాజు రాజు, పద్మం ప్రవీణ్, జిన్నారెడ్డి వెంకటేశ్వర్లు, దల్‌సింగ్, ఇంద్రారెడ్డి, బోల్ల రాజు, మదన్‌గోపాల్ లోయా, రెడ్ క్రాస్ సొసైటీ కోశాధికారి మాధవపెద్ది వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

- ఇనుగుర్తి(ఆంధ్రజ్యోతి): ఇనుగుర్తి మండల కేంద్రంలో సోమవారం ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ పుట్టినరోజు వేడుకలను పార్టీ మండల అధ్యక్షుడు కూరెల్లి సతీష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి పంచారు. కార్యక్రమంలో బైరు అశోక్‌గౌడ్, కాలేరు శివాజీ, చిన్నాలకట్టయ్య, గుజ్జునూరిబాబురావు, కొట్టంరాము పాల్గొన్నారు.
- నెల్లికుదురు(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అమూల్య గార్డెన్‌లో కాంగ్రెస్ కార్యకర్తల ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గొల్లపెల్లి ప్రభాకర్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎదళ్ల యాదవరెడ్డి, నాయిని సత్యపాల్‌రెడ్డి, కాసం లక్ష్మారెడ్డి, ఆకుతోట సతీష్, రావుల సతీష్, గుగులోత్ బాలాజీ నాయక్, పట్నంశెట్టి నాగరాజు, కుమ్మరికుంట్ల మౌనేందర్, మద్ది రాజేష్ ఇట్టె దేవేందర్‌రెడ్డి, సారంపెల్లి వెంకట్‌రెడ్డి, వివిధ గ్రామాల కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.
- కేసముద్రం(ఆంధ్రజ్యోతి) : కేసముద్రం మునిసిపల్ పరిధిలోని పూలే సెంటర్‌లో సోమవారం ఎమ్మెల్యే మురళీనాయక్ పుట్టిన రోజును మండల పార్టీ అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నాయకులు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఆర్‌టీఏ సభ్యుడు రావుల మురళి, సొసైటీ మాజీ చైర్మన్ బం డారు వెంకన్న, ధరావత్ బాలునాయక్, పొలెపాక నాగరాజు, చింతకుంట్ల వెంకన్న, నూకల వెంకటేశ్వర్లు, పొలెపల్లి వెంకట్‌రెడ్డి, కనుకుల రాంబాబు, కొండా సురేష్, నరేటి కొమురయ్య, తాజొద్దిన్, అల్లం గణేష్, బానోత్ వెంకన్న, రఫీఖాన్ తదితరులు పాల్గొన్నారు.